క్లుప్తంగా

సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ సంపత్‌కుమార్

పుల్లలచెరువు: ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, రహదారి భద్రతపై ఎస్ఐ అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకొని తల్లిదండ్రులను వీటిపై అప్రమత్తం చేయాలని చెప్పారు. అపరిచితుల వ్యక్తుల నుంచి ఫోన్‌లు రావడం, లాటరీ తగిలిందని చెప్పడం, బహుమతి వచ్చిందని, అకౌంట్ నంబర్ చెప్పండని రావడం, లింక్ ఓపెన్ చేయండి.. లక్షాధికారులవుతారని వంటి మెసేజ్‌లు వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని, వెంటనే సమాచారం పోలీసులకు తెలియజేయాలన్నారు. మెసేజ్‌లు ఓపెన్ చేస్తే మోసపోవడం ఖాయమని చెప్పారు. ప్రతి విద్యార్థి రహదారి నియమాలు పాటించాలన్నారు. విద్యార్థులు మోటర్ సైకిళ్ల నడపడం నేరమని, అలాంటి పనులు చేసి ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని ఎస్సై సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని మంచి మార్కులు సాధించాలని, క్రమశిక్షణ పాటించకుండా ఉంటే జీవితాలు నాశనం అవుతాయని, తల్లిదండ్రులను బాధపెట్టే పనిచేయవద్దని విద్యార్థులకు సూచించారు. హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులతో గ్రామీణుల బెంబేలు

- గ్రామానికి మూడు బెల్ట్‌షాపులు
- పోటాపోటీగా మద్యం విక్రయాలు
- గుడ్లప్పగించి చూస్తున్న ఎక్సైజ్, పోలీస్ అధికారులు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు అందడం లేదుగానీ మద్యం మాత్రం ఏరులై పారుతోంది. ప్రతి గ్రామంలో పోటాపోటీగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. మండలంలోని అన్నీ గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నా ఎక్సైజ్, పోలీస్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ముండ్లమూరు మండలంలో నాలుగు లైసెన్స్‌డ్ వైన్ షాపులు ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న 21 పంచాయతీలు, 52 గ్రామాల్లో సుమారు 200కుపైగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయంటే మద్యం ఏ విధంగా విచ్చలవిడిగా అమ్ముతున్నారో ఇట్టే తెలుసుకోవచ్చు. అగ్రహారం పంచాయతీలో 9, పూరిమెట్ల పంచాయతీలో 11 షాపులు ఉన్నాయి. మండలంలో చిన్న చిన్నవి పెద్దవి కలిపి సమారు 15 రెస్టారెంట్‌లు ఉండగా ప్రతి రెస్టారెంట్‌లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఉమామహేశ్వరపురం జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలోనే బెల్ట్‌షాపులో నడిరోడ్డు పైనే మద్యం విక్రయిస్తున్నారు. పాఠశాలకు వచ్చి వెళ్లే విద్యార్థులు సైతం మందుబాబుల రచ్చకు భయభ్రాంతులకు గురవుతున్నారు. బొప్పూడివారిపాలెంలో రెండు బెల్ట్‌షాపులు పోటాపోటీగా 24 గంటలూ మద్యం విక్రయిస్తున్నారు. వేముల ఆంజనేయస్వామి విగ్రహం పక్కన, సచివాలయం ఎదుట బెల్ట్ షాపులు నిర్వహిస్తూ అర్ధరాత్రి వరకు మద్యం విక్రయిస్తున్నారు. స్థానికులు కొందరు నడిరోడ్డులో తాగి తూలుతున్నారు.



వేముల సచివాలయం వద్ద పబ్లిక్‌గా మద్యం తాగుతున్న యువకులు



ముండ్లమూరులో ఓ రెస్టారెంట్‌లో ఇలా..



ఉమామహేశ్వరపురంలో తాగి పడిపోయిన మందుబాబు

పేదల వద్ద భారీ దోపిడీ

కూలినాలీ చేసుకుని సాయంత్రానికి ఇంటికి వచ్చే పేదల వద్ద క్వార్టర్ బాటిల్‌కు రూ.50 అదనంగా తీసుకుంటూ వారి శ్రమను, పేదల కష్టాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారు. క్వార్టర్ బాటిల్‌కు ప్రభుత్వం ధర కంటే రూ.50 అదనంగా తీసుకోవడంపై మందుబాబులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేసేందుకు ప్రత్యేక టీమ్

మద్యం షాపుల నుంచి బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసేందకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేశారు. మండలంలో టీడీపీ నాయకుల కనసన్నల్లో జరుగుతున్న ఈ ప్రక్రియలో ఒక్కో రూట్‌లో ఒక్కో నాయకుడు మద్యం సరఫరా చేస్తూ తమ హవా కొనసాగిస్తున్నారు. మీ బెల్ట్ షాపుల్లో మద్యం ఏ అధికారి వచ్చినా పట్టించుకోరు.. తాము మీకు అండగా ఉంటామని వ్యాపారులకు నాయకులు హామీ ఇస్తుండటం గమనార్హం.

మహిళా పోలీసులకు బెదిరింపులు

గ్రామంలో బెల్ట్‌షాపుల జోలికి వస్తే ఇబ్బందులు పడతారని కొందరు మహిళా పోలీసులకు కూడా బెదిరింపులు వస్తున్నాయి. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే ట్రాన్స్‌ఫర్ అవుతారని టీడీపీ నాయకులు నేరుగా హుకుం జారీ చేయడంపై కళ్ల ముందు జరుగుతున్న తతంగాన్ని చూస్తూ ఉండలేక మహిళా పోలీసులు లోలోన ఆవేదన చెందుతున్నారు.

విస్తుపోతున్న మహిళలు

గ్రామాల్లో బెల్ట్‌షాపులు చూసి మహిళలు విస్తుపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగి రోడ్లపై పొర్లాడుతుంటే చూస్తూ ఉండలేక లోలోన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందుబాబులు వేసే కేకలకు గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు తీసివేయాలని మహిళలు కోరుతున్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై మహేష్



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

పెద్దారవీడు: విద్యార్థులు విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎంఈఓ 1,2 పి.శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక గ్రంథాలయంలో గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయంలో గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వాటిని వినియోగించుకోవాలని చెప్పారు. విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలే కాకుండా అందుబాటులోని గ్రంథాలయాలు సందర్శిస్తూ పఠనాసక్తిని పెంపొందించుకోవాలని కోరారు. వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి మాట్లాడుతూ గ్రంథాలయంలో గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు, కథలు, అన్ని రకాల పుస్తకాలు చదవితే ఎంతో జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. అనంతరం వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖనం తదితర పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విశ్రాంతి డీఎల్ఓ అల్లు చలమారెడ్డి, జెడ్పీహెచ్ పాఠశాల చైర్మన్ గొట్టం శివశంకరరెడ్డి, నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు, కేజీబీవీ, జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే ఆధునిక దేవాలయాలని ఎస్సై మహేష్ కొనియాడారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని స్థానిక గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్సై మహేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను అందరూ వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపెందించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతను, సమాజంలో యువతపై డ్రగ్స్ ప్రభావం తదితర అంశాలపై ఆయన విద్యార్థులకు వివరించారు. సర్పంచ్ చిత్తూరి హారిక, పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, స్టేట్ బ్యాంక్ మేనేజర్ సురేష్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ బాలకృష్ణ, ఉపాధ్యాయులు తులసీబాయి, లక్ష్మీనాయక్ పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: విద్యార్థులు, యువతీ, యువకులు తమ విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై చౌడయ్య అన్నారు. సోమవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాల్లో తరగని విజ్ఞానం నిక్షిప్తమై ఉందని, అటువంటి అవకాశాన్ని తామందరం ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. శాఖ గ్రంథపాలకురాలు కె.ఝాన్సీ, ఎంఈవో పి.ఆంజనేయులు, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ యాదిద్యా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమాదేవి పాల్గొన్నారు.

కురిచేడు: గ్రంథాలయం నూతన భవనం ఏర్పాటుకు సహకరిస్తానని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి హామీ ఇచ్చారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. త్వరలోనే సంబంధిత అధికారులను కలిసి భవనం ఏర్పాటు గురించి మాట్లాడతానని తెలిపారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓ వస్తంనాయక్, సర్పంచ్ కె.కృష్ణయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీవీ రమణారావు, గ్రంథపాలకురాలు, ఎల్. సుమతి, విద్యార్థులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ 1, 2 శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం

వైఎస్ జగన్‌తో దొండేటి భేటీ

పెద్దదోర్నాల: వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ శాసన సభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దొండేటి నాగేశ్వరరెడ్డి బుధవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో కలిసిన ఆయన రాష్ట్రంలోని విద్యార్థుల సమస్యలు, నిరుద్యోగం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు.



జగన్‌తో ఎమ్మెల్యే తాటిపర్తి, నాగేశ్వరరెడ్డి

తాగునీటి పథకం నిధులు మంజూరు చేయాలి



సీపీఎం దర్శి మండల నూతన కమిటీ సభ్యులు

దర్శి: ప్రభుత్వం దర్శి పట్టణ మంచినీటి పథకానికి ప్రకటించిన రూ.121 కోట్లు మంజూరు చేయాలని సీపీఎం 7వ మహాసభ తీర్మానించింది. నగర పంచాయతీ ఏర్పాటు చేసి 5 సంవత్సరాలైనా అభివృద్ధికి నోచుకోలేదని, అభివృద్ధికి నిధులు విడుదల చేయకుండా ఇంటి పన్నులు, అపరాధ రుసుం, ఇతర పన్నులు నగర ప్రజలపై 3.4 రెట్లు పెంచారని సీపీఎం కార్యదర్శి తాండవ రంగారావు పేర్కొన్నారు. దర్శి పట్టణం సమగ్రంగా అభివృద్ధి జరిగేందుకు రూ.300 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 7వ మహాసభ 18 తీర్మానాలు ఆమోదించిందని, వాటిని పత్రికలకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. పట్టణ మంచినీటి పథకం అమృత పథకం నిధులు విడుదల చేసి ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలని కోరారు. పొదిలి రోడ్డులో ఉన్న కార్జెడు వాగుపై బ్రిడ్జి నిర్మించాలని, నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన డ్రైవింగ్ స్కూల్‌కు నిధులు విడుదల చేయాలని, యువతకు ఉపాధి చూపాలని, పట్టణ విస్తరణకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను పెంచి అన్ని ప్రాంతాల్లో శుభ్రం చేయాలని, రైతు బజారు నిర్మాణం పూర్తి చేయాలని, నడికుడి-శ్రీ కాళహస్తి రైల్వే లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, శిథిలావస్థలో ఉన్న ఎన్ఏపీ స్కీం ఫిల్టర్ బెడ్‌లు, ట్యాంకులు, సంపులు, పైపులైన్లు ఆధునికీకరించాలని, దొనకొండ పారిశ్రామిక కేంద్రానికి నిధులు కేటాయించాలని, పలు తీర్మానాలను సభ ఆమోదించింది. అనంతరం మండల నూతన కమిటీని ఎంపిక చేశారు. కార్యదర్శిగా సందు వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులుగా తాండవ రంగారావు, కేవీ పిచ్చయ్య, యూ. నారాయణ, ఈ.నాగేశ్వరరావు, టి.రమాదేవి, పి.పుల్లయ్యలను ఎంపిక చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. ఆంజనేయులు, ఎం.రమేష్, వి.ఆంజనేయులు, పీఎఫ్ బాబు పాల్గొన్నారు.

పట్టుదలతో కృషి చేస్తే విజయం సాధ్యం



పెద్దారవీడు: మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు



మమతను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దారవీడు: విద్యార్థులు పట్టుదలతో కృషి చేస్తే ఎంతటి విజయాన్నైనా సొంతం చేసుకోవచ్చని ఎంఈఓ 1,2 పి.శ్రీనివాసులు, సబ్రహ్మణ్యం అన్నారు. బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు గ్రామం వీధుల్లో ర్యాలీగా బయల్దేరి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో మానవహారంగా ఏర్పడ్డారు. ఎంఈఓలు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. బాల్య వివాహాలు పూర్తి స్థాయిలో అరికట్టాలని, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి, గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ గొట్టం శివశంకరరెడ్డి, ఉపాధ్యాయులు షేక్ రెహమాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పొట్లపాడు విద్యార్థిని ప్రతిభ

కురిచేడు: బంగారు బాలోత్సవం వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన చిత్రకళ పోటీల్లో మండలంలోని పొట్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్. దివ్య జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. డివిజన్, జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బుల్లెమ్మ, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందించారు. దివ్యకు బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతులమీదుగా సర్టిఫికెట్ అందజేశారు.

బొమ్మలాపురం విద్యార్థిని ప్రతిభ

పెద్దదోర్నాల: బంగారు బాల్యం వారోత్సవాల్లో మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పెద్దబొమ్మలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని మందా మమత బాల కార్మికత్వం, అక్రమ రవాణా వ్యాస రచన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. దీంతో పాటు మార్కాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొని డివిజన్ స్థాయిలో 2వ బహుమతి సాధించి జిల్లా పోటీలకు ఎంపిక కావటం పై పలువురు అభినందనలతో ముంచెత్తారు. ఎంఈఓ మస్తాన్‌నాయక్‌తో పాటు ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీలక్ష్మీబాయి, సిబ్బంది, బాలికకు గైడ్‌గా వ్యవహరించిన మల్లికార్జున తదితరులు అభినందించారు.

ఐ టీడీపీ, జనసేన కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలి



ఏఎస్సై రాంబాబుకు ఫిర్యాదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- పోలీసులకు వైఎస్సార్ సీపీ నేతల ఫిర్యాదు

దర్శి: ఐ టీడీపీ, జనసేన కార్యకర్తలు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏఎస్సై రాంబాబుకు ఫిర్యాదు అందజేశారు.

ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియాలో చెప్పలేని భాషలో అనుచిత పోస్టులు చేయడం బాధాకరమన్నారు. మాజీ సీఎంపై తప్పుడు పోస్టులు పెడుతున్నా పట్టించుకోకపోవడం దారుణంగా ఉందన్నారు. అందుకే చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశామని వెంకటరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కేవీరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, కౌన్సిలర్‌లు మేడం మోహన్‌రెడ్డి, తుళ్లూరి బాబూరావు, జగన్నాథం మోహన్‌బాబు, ఎంపీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, నాయకులు కుందురు నరసింహారెడ్డి, అంకాల నాగయ్య, అన్నవరపు రవి, మజ్జివలి పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

కురిచేడు: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని కురిచేడు, కల్లూరు, ఆవులమంద గ్రామాల్లో బుధవారం తమ సిబ్బందితో కలిసి ఆయన దాడులు నిర్వహించారు. కురిచేడుకు చెందిన జక్కుల కృష్ణయ్య వద్ద 12 మద్యం బాటిళ్లు, జింకల వెంకటేశ్వరరెడ్డి వద్ద 20 మద్యం బాటిళ్లు లభించినట్లు తెలిపారు. వారిద్దరిపై కేసులు నమోదు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రభుత్వం బెల్ట్ షాపుల నిర్వహణపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేసిందని, ఎవరైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది కానిస్టేబుళ్లు కె.ఏడుకొండలు, ఎస్.శ్రీనివాసులు, పి. నాగరాజు, ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు

మంచంపట్టిన రుద్రసముద్రం



ఆర్ఎంపీ వద్ద చికిత్స పొందుతున్న చెన్నమ్మ

- ఇంటింటికీ జ్వరపీడితులు

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రంలో సుమారు 100 మంది జ్వరపీడితులు మంచం పట్టారు. 20 రోజుల నుంచి గ్రామంలో జ్వరాలతో చిన్నా, పెద్దా తేడా లేకుండా అంతా అల్లాడిపోతున్నారు. ఆర్థిక స్తోమత ఉన్న వారు మార్కాపురం, నరసరావుపేట, గుంటూరు తదితర ప్రాంతాలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. మరికొంత మంది ఆర్ఎంపీల వద్ద చికిత్స పొందుతున్నారు. గ్రామంలో జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే వైద్య సిబ్బంది కన్నెత్తి చూడలేదని స్థానికులు మండిపడుతున్నారు. దొనకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు, ఇద్దరు సూపర్‌వైజర్లు ఉన్నారు. గ్రామాల్లోని సచివాలయాల్లో ఏఎన్ఎం విధులు నిర్వహిస్తున్నారు. చెన్నుబోయిన చెన్నమ్మ, చెన్నుబోయిన బసవమ్మ ఆర్ఎంపీల వద్ద చికిత్స పొందుతున్నారు. కటారి రాములు మార్కాపురంలో నెల నుంచి చికిత్స పొందుతోంది. మరికొంత మంది నరసరావుపే, గుంటూరులో చికిత్స పొంది వేలకు వేలు డబ్బులు ఖర్చు చేసుకున్నారు. గ్రామంలో ముగ్గురు డెంగీతో బాధపడుతూ గుంటూరులో వైద్యం పొందారని గ్రామానికి చెందిన చెన్నుబోయిన గురుమూర్తి, బాలయ్య తెలిపారు. గ్రామంలో ఎవరిని అడిగినా ఏఎన్ఎం ఎవరో తమకు తెలియదని, తమ ఇంటికి రాలేదని చెబుతున్నారు. గ్రామంలో సుమారు 5 వేల మంది జనాభా ఉన్నారు. అందరూ వ్యవసాయ పనులు చేసుకునే వారే. జిల్లా వైద్యాధికారులు స్పందించి గ్రామస్తులకు మెరుగైన చికిత్స అందించాలని స్థానికులు కోరుతున్నారు.



మంచం పట్టిన బసవమ్మ



మార్కాపురంలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన కటారి రాములు

వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో సువాసిని పూజలు



సువాసినీకి పూజలు చేస్తున్న శిద్దా లక్ష్మీపద్మావతి

దర్శి: వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో సువాసిని పూజా కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో 135 మంది సువాసినులకు సువాసినీ పూజలు నిర్వహించారు. శిద్దా లక్ష్మీపద్మావతి కార్యక్రమంలో పాల్గొని సువాసునులకు పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

దర్శి: పట్టణంలోని ఆదిత్య లాడ్జిలో ఏర్పాటు చేసిన పేకాట శిబిరంపై సీఐ రామారావు బుధవారం దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. జూదరుల నుంచి రూ.22 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పేకాట శిబిరాలు నిర్వహించినా, కోడి పందేలు ఆడినా, ఆడించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐతో పాటు ఎస్సై మురళి, సిబ్బంది కాశయ్య, శ్రీను, మహేష్, జిలానీ, గిరి, కొండలు పాల్గొన్నారు.